PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక 214 | పేజీలు : 8 | వెల రూ.5 | శుక్రవారం 28.08.2026
ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh




## గాయత్రి, త్రిసా జాలీకి సీఎం రేవంత్ అభినందనలు



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు: ఇటీవల బ్యాడ్మింటన్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ మహిళల డబుల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించిన గాయత్రి గోపీచంద్, త్రిసా జాలీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణులు గాయత్రి గోపీచంద్, త్రిసా జాలీ మంగళవారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో రేవంత్ రెడ్డిని కలిశారు. ఇటీవల జరిగిన బ్యాడ్మింటన్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో మహిళల డబుల్స్ విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచిన గాయత్రి గోపీచంద్, త్రిసా జాలీ కాంస్య పతకాన్ని సాధించారు. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి, రాష్ట్రానికి గుర్తింపు తీసుకొచ్చిన ఇద్దరు క్రీడాకారిణులను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి దేశానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. బ్యాడ్మింటన్ రంగంలో గాయత్రి, త్రిసా జాలీ సాధిస్తున్న విజయాలను సీఎం అభినందిస్తూ, క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. యువ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా మరింత ప్రోత్సాహం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, మాజీ బ్యాడ్మింటన్ ప్లేయర్ పి.వి.వి. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. గాయత్రి గోపీచంద్, త్రిసా జాలీ సాధించిన కాంస్య పతకంపై పలువురు అభినందనలు తెలిపారు.

## వన మహోత్సవ లక్ష్యాలను పూర్తి చేయాలి: మంత్రి సీతక్క



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు: రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకుంటూ వన మహోత్సవం లక్ష్యాలను పూర్తి చేయడంతో పాటు, ఉపాధి హామీ పనులు, నీటి సంరక్షణ, జీవనోపాధి ఆస్తుల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా.దనసరి అనసూయ (సీతక్క) ఆదేశించారు. సచివాలయం నుంచి జిల్లా స్థాయి అధికారులతో ఈరోజు మంత్రి శ్రీమతి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని వివిధ కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఇతర శాఖల పరిధిలో వన మహోత్సవ కార్యక్రమాలు ఇటీవల ప్రారంభమైనప్పటికీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ముందుగానే ప్రారంభించి ఇప్పటికే 86 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 6.18 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 5.32 కోట్లకు పైగా మొక్కలు నాటడం జరిగిందని చెప్పారు. ఇది గణనీయమైన పురోగతి అని పేర్కొంటూ, మిగిలిన లక్ష్యాన్ని కూడా వర్షాలు అనుకూలంగా ఉన్న ప్రస్తుత సమయంలో పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఎండాకాలంలోనే ఉపాధి హామీ కూలీల సహకారంతో మొక్కలు నాటేందుకు గుంతలు సిద్ధం చేశామని, ఎల్‌నినో పరిస్థితులు ఉన్నప్పటికీ తొలి వర్షాలు పడగానే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించామని మంత్రి తెలిపారు. ఇప్పుడు 86 శాతం లక్ష్యం పూర్తయిన నేపథ్యంలో నాటిన మొక్కలు ఏ మేరకు ఎదుగుతున్నాయి, వాటి మనుగడ ఎలా ఉంది అన్నదానిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని సూచించారు.

# సెప్టెంబర్ 2 తర్వాత కొండా సురేఖపై వేటు?

### కేసీ వేణుగోపాల్ రాక తర్వాతే తుది నిర్ణయం



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు మంత్రి కొండా సురేఖ వ్యవహారం కాంగ్రెస్ పార్టీలో మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఆమెపై చర్యలు తీసుకునే విషయంలో సెప్టెంబర్ 2 తర్వాత కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం విదేశాల్లో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సెప్టెంబర్ 2న ఢిల్లీకి చేరుకున్న తర్వాత ఈ వ్యవహారంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. కొండా సురేఖ వ్యవహారంపై ఇప్పటికే కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ తన అభిప్రాయాలను, సిఫార్సులను పార్టీ అధిష్టానానికి అందించినట్లు తెలుస్తోంది. అయితే తుది నిర్ణయం తీసుకునే ముందు కేసీ వేణుగోపాల్ రాక కోసం అధిష్టానం వేచి చూస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఆయన ఢిల్లీకి చేరుకున్న తర్వాత క్రమశిక్షణ కమిటీ సిఫార్సులపై ముఖ్య నేతలతో చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

**భట్టి విక్రమార్క జోక్యానికి దూరం?**

కొండా సురేఖ వ్యవహారంలో రాజీ ప్రయత్నాలు, రాయబారం చేయాల్సిందిగా కొందరు నేతలు సూచించినప్పటికీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాత్రం ఈ విషయంలో జోక్యం చేసుకునేందుకు విముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. పార్టీ క్రమశిక్షణకు సంబంధించిన అంశంలో తాను జోక్యం చేసుకోబోనన్న వైఖరితో ఆయన ఉన్నట్లు తెలుస్తోంది.

**క్రమశిక్షణ కమిటీ నిర్ణయమే కీలకం**

ఇప్పటికే ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వైఖరిని స్పష్టం చేసినట్లు సమాచారం. క్రమశిక్షణ కమిటీ తీసుకునే నిర్ణయమే ఫైనల్ అని ఆయన తేల్చి చెప్పినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో కొండా సురేఖపై ఎలాంటి చర్యలు ఉండబోతున్నాయన్న అంశంపై కాంగ్రెస్‌లో ఉత్కంఠ నెలకొంది. కేసీ వేణుగోపాల్ ఢిల్లీకి చేరుకున్న తర్వాత క్రమశిక్షణ కమిటీ సిఫార్సులు, రాష్ట్ర నేతల అభిప్రాయాలు, తాజా పరిణామాలపై సమీక్ష జరిగే అవకాశం ఉంది. ఆ తర్వాతే కొండా సురేఖ విషయంలో అధిష్టానం తుది నిర్ణయం తీసుకుంటుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి నిర్ణయం వెలువడాల్సి ఉంది.

## ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి ఎథిక్స్ కమిటీ నోటీసులు

- కడియం శ్రీహరిపై వ్యాఖ్యలపై విచారణ
- ఆగస్టు 29న కమిటీ భేటి

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు
బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి తెలంగాణ అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ నోటీసులు జారీ చేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వచ్చిన ఫిర్యాదును కమిటీ విచారించనుంది. ఈ మేరకు కౌశిక్ రెడ్డిని విచారణకు హాజరు కావాలని ఎథిక్స్ కమిటీ సూచించినట్లు సమాచారం. ఈ నెల ఆగస్టు 29న ఉదయం 11 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్--1లో ఎథిక్స్ కమిటీ సమావేశం నిర్వహించనున్నారు. ఈ భేటీలో కౌశిక్ రెడ్డిపై వచ్చిన ఫిర్యాదుపై సభ్యులు విచారణ చేపట్టనున్నారు. కడియం శ్రీహరిపై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆధారంగా చేసుకుని వచ్చిన ఫిర్యాదును కమిటీ పరిశీలించనుంది. విచారణలో భాగంగా కౌశిక్ రెడ్డి వివరణను కూడా కమిటీ తీసుకునే అవకాశం ఉంది. ఈ వ్యవహారంపై ఎథిక్స్ కమిటీ విచారణ అనంతరం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# నేడు ఇందిరాపార్క్ వద్ద ఉద్యోగుల జేఏసీ మహాధర్నా

### సీపీఎస్ రద్దు, పెండింగ్ బిల్లుల విడుదల సహా పలు డిమాండ్ల సాధనకు నిరసన




హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు
ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నేడు హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నారు. సీపీఎస్ రద్దు, పెండింగ్‌లో ఉన్న బిల్లుల విడుదల, డీఏల చెల్లింపు, ఈహెచ్ఎస్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయడం వంటి పలు ప్రధాన డిమాండ్ల సాధనే లక్ష్యంగా ఈ నిరసన కార్యక్రమానికి జేఏసీ పిలుపునిచ్చింది. ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఉద్యోగుల జేఏసీ ఆరోపిస్తోంది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ మహాధర్నా చేపడుతున్నట్లు తెలిపింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇందిరాపార్క్ వద్ద నిరసన కార్యక్రమాలు కొనసాగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, పెన్షనర్లు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంది.

**ప్రధాన డిమాండ్లు**

ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే విడుదల చేయాలని ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేస్తోంది. అలాగే ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన సుమారు రూ.10 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరుతోంది. ఉద్యోగుల ప్రధాన సమస్యగా ఉన్న సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఉద్యోగులు, పెన్షనర్లకు ఈహెచ్ఎస్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తోంది. మరోవైపు, సెప్టెంబర్ 1న సీపీఎస్ ఉద్యోగులు, పెన్షనర్ల నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జేఏసీ ప్రకటించింది. సీపీఎస్ రద్దు కోసం భవిష్యత్‌లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసే అంశంపై కూడా ఉద్యోగ సంఘాలు దృష్టి సారిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ఈ నెల 29న నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చిన తెలంగాణ పవర్ జేఏసీని నిరసన ఆలోచనను విరమించుకుని చర్చలకు రావాలని టీజీ ట్రాన్స్‌కో కోరింది. ఉద్యోగుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించేందుకు ముందుకు రావాలని సూచించినట్లు సమాచారం.



## కారుపై 3,400 ముద్దులు.. రూ.5,500 ఫైన్



గ్వాలియర్ – ప్రభాత సూర్యుడు
మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఓ విచిత్ర ఘటన చోటుచేసుకుంది. ఓ యువతి తన ప్రియుడి కారుపై ఏకంగా 3,400 ముద్దులు పెట్టడంతో కారు మొత్తం లిప్‌స్టిక్ మార్కులతో నిండిపోయింది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో పోలీసుల దృష్టికి వెళ్లాయి. ప్రియుడితో కలిసి కారులో ప్రయాణించిన యువతి సరదాగా కారు బయట భాగంపై వరుసగా ముద్దులు పెట్టినట్లు సమాచారం. దీంతో కారు మొత్తం లిప్‌స్టిక్ మరకలతో నిండిపోయింది. ఈ విషయాన్ని గుర్తించిన పోలీసులు కారును ఆపి విచారించారు. వాహనంపై పెద్ద సంఖ్యలో లిప్‌స్టిక్ మార్కులు ఉండటంతో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి రూ.5,500 చలాన్ విధించినట్లు సమాచారం. అంతటితో ఆగకుండా కారు మొత్తం ఉన్న లిప్‌స్టిక్ మార్కులను తొలగించాలని పోలీసులు ఆదేశించారు. దీంతో యువకుడు, యువతి కలిసి కారుపై ఉన్న మరకలను శుభ్రం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో నెటిజన్లు ఆసక్తికరంగా స్పందిస్తున్నారు. విచిత్రంగా సాగిన ఈ ఘటన గ్వాలియర్‌లో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## ఫార్ములా ఈ–కార్ రేస్ కేసు.. సెప్టెంబర్ 18కు విచారణ వాయిదా



కేటీఆర్ | అర్వింద్‌కుమార్ | బీఎల్ఎన్ రెడ్డి

హైదరాబాద్: ఫార్ములా ఈ–కార్ రేస్ కేసులో నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి కోర్టుకు హాజరయ్యారు. మాజీ మంత్రి కేటీఆర్ మాత్రం వ్యక్తిగత కారణాలతో విచారణకు హాజరు కాలేకపోతున్నట్లు ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ మేరకు కేటీఆర్ తరఫు న్యాయవాది అబ్సెంట్ పిటిషన్ దాఖలు చేశారు. కేసుకు సంబంధించిన విచారణను పరిశీలించిన నాంపల్లి కోర్టు తదుపరి విచారణను సెప్టెంబర్ 18కు వాయిదా వేసింది. దీంతో తదుపరి విచారణలో కేసుకు సంబంధించిన అంశాలపై కోర్టులో మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



## ఆగస్టు29 నుంచి హైదరాబాద్‌లో నైట్ బస్ సర్వీసెస్

2లో

